

వివరాలు మెయిన్‌లో

**సిఇసి జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేయాలి**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 29 సెప్టెంబరు , 2026 | పేజీలు : 8

# పనిచేయలేకపోతే వెళ్లిపోండి..

## పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వార్నింగ్

### గ్రామాభివృద్ధిలో కార్యదర్శులే కీలకం



**ప్రజాపక్షం/మునుగోడు** : ఇబ్బందులు ఉంటే చెప్పండి పరిష్కరిస్తా..అంతేగాని గ్రామాల అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పనిచేయలేని కార్యదర్శులు నిర్మొహమాటంగా వెళ్లిపోవాల ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు ఘాటుగా హెచ్చరించారు.సోమవారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మునుగోడు మండలంలోని 28 గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు,అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ,వీధుల శుభ్రత,చెత్త సేకరణ,డంపింగ్ యార్డుల నిర్వహణపై కూలంకషంగా చర్చించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి అవసరమైన డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, తాగునీటి సమస్యలు అధిగమించడానికి చేయాల్సిన అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.కార్యదర్శుల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని,మెరుగ్గా పనిచేసే కార్యదర్శులు మాత్రమే ఇక్కడ ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని స్పష్టం చేశారు.పనితీరు మెరుగుపరుచుకోవాలని, ప్రతి నెలా కార్యదర్శుల పనితీరుపై నివేదిక తెప్పించుకుంటానని తెలిపారు.ఎల్ నినో పరిస్థితుల వల్ల రాబోయే కాలంలో గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఇప్పటినుండే ముందుచూపుతో పనిచేస్తేనే ఇబ్బందులను అధిగమించగలమన్నారు.వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీఓ, తహసీల్దార్,ఎంపీఓ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వాతావరణం కల్పించాలి

## నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థులు బాగా చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ఇందుకుగాను జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లు,ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షిస్తూ విద్యా సంస్థల్లో సరైన సౌకర్యాలు కల్పించి మంచి చదువు ద్వారా పిల్లలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యాశాఖ అధికారులతో పాటు జిల్లాలోని సీనియర్ అధికారులు కూడా ప్రతి విద్యాసంస్థను తనిఖీ చేసి లోపాలను గుర్తించి సరిదిద్దాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను నూటికి నూరు శాతం పరిశీలించి సౌకర్యాలు కల్పిస్తున్నామని, జిల్లాలో ఉన్న 1245 పాఠశాలలకుగాను 1190 పాఠశాలలను పరిశీలించగా 58 పాఠశాలల్లో టాయిలెట్లు లేవని గుర్తించామని, వాటిని ఏర్పాటు చేస్తే నూరు శాతం టాయిలెట్ల లక్ష్యం పూర్తవుతుందన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,సంక్షేమ శాఖల అధికారులు, టీఎస్ఎండీఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లా జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం కలకలం

## పురుగుల మందు తాగిన ఖైదీ బాబురావు

## గుట్టుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నా జైలు అధికారులు

## ఆత్మహత్య కాదంటూ జైలు అధికారుల వివరణ..



**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా జైల్లో ఖైదీ ఆత్మహత్యాయత్నం కలకలం రేపింది.సోమవారం సాయంత్రం జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ బాబురావు పురుగుల మందు తాగి అపస్మారక స్థితి లోకి వెళ్లినట్లు సమాచారం. గుర్తించిన తోటి ఖైదీలు జైలు అధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ స్టమక్ వాష్ చేసి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.జిల్లా జైల్లోకి పురుగుల మందు ఎలా వచ్చిందనేది ప్రశ్నార్థకంగా మారింది. జైల్లో కూరగాయలు, ఇతర మొక్కల పెంపకానికి సంబంధించి తెచ్చిన మందులు అయి ఉండవచ్చని ఖైదీలు చెబుతున్నారు.బాబురావు మోత్కూరులో జరిగిన హత్య కేసులో నిందితుడిగా శిక్ష అనుభవిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తూ మూడేళ్ల క్రితం నల్లగొండ జైలుకు తరలించారు. విషయం బయటకు రాకుండా జైలు అధికారులు గుట్టుగా చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జైలు సూపరింటెండెంట్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులోకి రాలేదు. జైలర్ బాలకృష్ణ మాట్లాడుతూ గత రెండు రోజులుగా అనారోగ్యంతో ఉండి కళ్లు తిరిగి పడిపోవడంతో ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నామని, ఆత్మహత్యాయత్నం కాదని వివరణ ఇచ్చారు.

# నల్లగొండ ఉర్సు ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నల్లగొండ** :నల్లగొండలోని హజరత్ సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి.అక్టోబర్ 1 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఉర్సు ఉత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచనలకు అనుగుణంగా, మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ శాఖ సహకారంతో దర్గా పరిసరాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపడుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక సందడి :**

ఉర్సు ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 1న మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై గడియారం సెంటర్, ఆర్పీ రోడ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, ఓల్డ్ సిటీ చౌరస్తా, గంజ్ మీదుగా దర్గా మెట్ల వద్దకు చేరుకోనుంది. అనంతరం హజరత్ లతీఫ్ షా వలీకి గంధం సమర్పిస్తారు.అక్టోబర్ 2న అన్నదాన కార్యక్రమం, మెహిల్‌ఎనాత్ షరీఫ్‌తో పాటు ప్రత్యేక దీపాలంకరణ నిర్వహించనున్నారు. అక్టోబర్ 3న ప్రముఖ గాయకులతో ఖవ్వాలి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఉర్సు ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు దర్గా ముతవల్లీలు, ఉర్సు కమిటీ, కార్పొరేటర్లు, నాయకులు సమన్వయంతో కృషి చేస్తున్నారు.ఈ ఏర్పాట్లలో దర్గా ఇనాందార్ ముతవల్లీలు సయ్యద్ సమీఉల్లా ఖాద్రి, సయ్యద్ గౌస్ ఖాద్రి, సయ్యద్ సల్మాన్ ఖాద్రి, ఉర్సు కమిటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ హాషం, మసి అద్వకేట్, ఉర్సు కమిటీ సెక్రటరీ, కార్పొరేటర్ సయ్యద్ సమద్‌తో పాటు నవీద్, ఫిరోజ్, పాషా, ఇల్యాస్, వెంకన్న తదితరులు పాల్గొంటున్నారు.

## మద్యంతాగి బైకు నడిపిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమాన

**ప్రజాపక్షం/మునగాల:** మద్యంతాగి బైకు నడిపిన వ్యక్తికి కోదాడ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోదాడ ఎండి ఉమర్ ముందు హాజరుపర్చగా ఒకరోజు జైలుశిక్ష, రెండువేల జరిమాన విధించినట్లు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఈనెల 25న మునగాల మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట గ్రామానికి చెందిన పెద్దపోగు అవినాష్ అనే వ్యక్తి మద్యం సేవించి లారీ నడుపుతుండగా ఎస్ఐ ఆపి తనిఖీ చేసి బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేయగా మద్యం సేవించినట్లు రిపోర్టు వచ్చిందని, సదరు వ్యక్తిని కోర్టుకు హాజరుపర్చగా జడ్జి ఎండి ఉమర్ ఒకరోజు జైలుశిక్ష, రెండు వేల జరిమాన విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని అన్నారు.

## అసత్య అరోపణలు మానుకోవాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** హుజూర్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ భవిష్యత్ నాయకుడు పిల్లుట్ల రఘుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన అరోపణలను తక్షణమే మానుకోవాలని బిఆర్ఎస్ మండ పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణనాయక్ అన్నారు. నియోజకవర్గంలో ప్రతి సమస్యను తన సమస్యగా భావించి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటున్నయువ నాయకుడు పిల్లుట్ల రఘుపై ఆదరణ ఓర్వలేక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ఎమ్మెల్యేగా గెలవాలంటే వార్డు నెంబర్ గెలవాల్సిన అవసరం లేదని అన్నారు.

## ఎంఎస్‌ఎఫ్ మండల అధ్యక్షుడిగా చక్రవర్తి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** విద్యా సంస్థలలో మాదిగ స్టూడెంట్స్ పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఫీజు రియంబర్స్‌మెంట్ కాని, హస్టల్ వసతిలో ఉండే సౌకర్యాలు, విదేశి విద్యలో, విద్యకు సంబంధించి ఇంకా వివిధ లోపాలను గుర్తించి మాదిగ జాతికి ఎలాంటి అన్యాయం జరగకుండా పనిచేస్తామని ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి పందిటి నవీన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ నూతన మండల కమిటిని నియమించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడిగా బుడిగ చక్రవర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కొత్తపల్లి రవి, నకిరేకంటి రవి, దూరే వినోద్, బరిగల సతీష్, ఆలంపల్లి శేఖర్, రాజు, మాచర్ల కనకయ్య, గురేష్, నాగార్జున, సురేష్, పిట్ట వెంకటేష్ పాల్గొన్నారు.

## చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని వెలిదండ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను సోమవారం హుజూర్‌నగర్‌లోని మంత్రి కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చెనగాని వెంకన్న లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. గడ్డం నాగలక్ష్మికి 45వేలు, గందు రాంబాబుకు 60వేలు, వత్సవాయి త్రివేణి 17500 రూపాయల చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందజేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



## ఓట్ల చోరీ ఆరోపణలపై జ్ఞానేష్ కుమార్‌ను అరెస్టు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఓట్ల చోరికి సంబంధించిన ఆరోపణలపై జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బిజెపి అనుకూల ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర ధర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం మరింత బలోపేతం అయ్యేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల హక్కులను కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఓట్ల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చట్టప్రకారం సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు తేలిన అనంతరం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని వినతి



**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రానికి ప్రతి రోజు నిత్యం గ్రామాల నుండి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, బ్యాంకులు, ఆసుపత్రులు, మార్కెట్, వ్యాపార సంస్థలు ఇతర అవసరాల నిమిత్తం పెద్ద సంఖ్యలో వస్తుంటారని అందుకు పబ్లిక్ టాయిలెట్లు లేక పోవడం వల్ల మహిళలు, వృద్దులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై మార్కెట్ ప్రాంతం, ప్రధాన రహదారి, ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాల్లో ఈ సమస్య మరింతగా కనిపిస్తోందని మునగాల జనవేదిక కన్వీనర్ మరువాడ ఆంజనేయ శర్మ అన్నారు. ఈ విషయమై సోమవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆంజనేయ శర్మ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రజలకు అనుకూలమైన ప్రదేశాలను గుర్తించి, వాటి నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా టాయిలెట్ల వద్ద తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం నిర్వహణ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించి, నిరంతరం శుభ్రంగా ఉండేలా సంబంధిత శాఖ ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని కోరారు.

## ఉద్యోగ ఇంటర్వ్యూలకు విద్యార్థులు సద్వినియోగం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిష్టాత్మక హెటెరో ల్యాబ్స్ సంస్థ సౌజన్యంతో ఈ నెల 30న ప్రాంగణ ఎంపికలు (క్యాంపస్ ఇంటర్వ్యూలు) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జునరెడ్డి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత విద్యార్హతలకు తగిన ఉపాధి మార్గాలను చూపే దిశగా పరిశ్రమల ప్రాధాన్యతలను అనుసరించి నియామక ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు హెటెరో ల్యాబ్స్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. నిరుద్యోగ యువత, అర్హత కలిగిన అభ్యర్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో శ్రేష్ఠమైన ఉద్యోగాలు సాధించడానికి సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం ఎంతో అవసరమని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డుతో సమయానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. చదువు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు స్థానికంగానే దిగ్గజ సంస్థలలో ఉద్యోగాలు పొందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతాంగానికి నకిలీ, కల్తీ లేదా నాణ్యతలేని ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయ సంచాలకులు కొనిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మిర్యాలగూడ మండల కేంద్రంలోని ప్రధాన ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రైతు మిత్ర ఫెర్టిలైజర్స్, వెంకటరమణ, లక్ష్మి సాయినాథ్ ఫెర్టిలైజర్స్, విశ్వామిత్ర తదితర విక్రయ కేంద్రాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో అందుబాటులో ఉన్న ఎరువులు, పురుగు మందుల స్టాక్ నిల్వలు, అధికారిక లైసెన్సులు, కొనుగోలు, అమ్మకాల రికార్డులు, క్యాష్ బిల్లు పుస్తకాలు, పురుగు మందుల గడువు తేదీలను సరి చూశారు.ప్రభుత్వ నిబంధనలకు లోబడి, పారదర్శకంగా మాత్రమే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు ఎరువులు అమ్మినా, కల్తీ ఎన్పీకే మిశ్రమాలను నిల్వ ఉంచినా కఠినమైన శాఖాపరమైన విచారణతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎమ్.రుషేంద్రమని, ముక్కరమూర్తి, నామిరెడ్డి అశోక్ రెడ్డి, హరిబాబు, సంబంధిత డీలరు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఎనిమిది దరఖాస్తులు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణిలో కార్యక్రమంలో సోమవారం 8 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపివో నాగరాజు తెలిపారు. వీటిలో రెవిన్యూ శాఖకు సంబంధించి 5 దరఖాస్తులు, హౌసింగ్ శాఖకు సంబంధించి రెండు, ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.



## జిఒ నెంబర్ 25 సవరించాలి

**ప్రజాపక్షం/మునగాల:** రాష్ట్ర విద్యాశాఖ తీసుకవచ్చిన జీవో నెంబర్ 25 వల్ల ప్రాథమిక విద్య నాశనమవుతుందని ఎస్‌జిటి సంఘం నాయకులు అడిదల వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన రెండవరోజు కాంప్లెక్స్ సమావేశంలో మద్యాహ్న భోజన విరామ సమయంలో ఎస్‌జిటి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడ, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడి పోస్టు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బజ్జురి శ్రీకాంత్‌రెడ్డి, మట్టపల్లి రాము, లక్ష్మణచారి, భాస్కర్, నాగార్జున, సైదిరెడ్డి, బుడిగె శ్రీను, ఉపేందర్, సతీష్, దినేష్, నాగలక్ష్మి, ఉపేంద్రమ్మ, మణెమ్మ, సరిత, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మేళ్లచెరువు రైతుల సమస్యల పరిష్కారానికి మంత్రి ఉత్తం హామీ



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** తమ పట్టా భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మేళ్లచెరువు గ్రామానికి చెందిన రైతులు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో సర్వే నెంబర్ 1057లో ఉన్న తమ పట్టా భూములను అధికారులు నిషేదిత జాబితాలో చేర్చడం వల్ల తాము ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను రైతులు ఈ సందర్భంగా మంత్రికి కులంకశంగా వివరించారు. నిషేదిత జాబితా నుండి తమ పట్టా భూములను తక్షణమే తొలగించే సమస్యను పరిశీలించి తమకు న్యాయం చేయాలని వారు మంత్రిని వేడుకున్నారు. రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ సమస్యను త్వరలోనే పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నిషేదిత జాబితా నుండి తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. మేళ్లచెరువు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మందకృష్ణ మాదిగ అదేశాల మేరకు అక్టోబర్ 6న హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటిలో జరగనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎడవెల్లి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం నేరేడుచర్లలోని పలు జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి సాధించిన ఉద్యమ ఫలితాలు, సామాజిక న్యాయం కోసం చేపట్టిన పోరాటాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం నేరేడుచర్ల మండల కమిటిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి పందిటి నవీన్, కుర్రి వెంకన్న, ఉబ్బెపల్లి శ్యామ్, చింత గోపి, ఆర్. కృష్ణసాయి, కరుణాకర్, గంజాయి ప్రవీణ్, బిక్షం, అనంద్‌కుమార్, సతీష్, నవీన్, మహేష్, గోపిక పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తమ ఫౌండేషన్ కృషి

**ప్రజాపక్షం/తుంగతుర్తి (నాగారం) :** తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని డాక్టర్ నలమాస కృష్ణ, ఫౌండేషన్ చైర్మన్ నలమాస సంధ్య అన్నారు. సోమవారం నాగారం మండల పరిధిలోని ఈటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌కెఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ నాలెడ్జి పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోపాటు పేదల వైద్యంకు సహాయపడడం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఇఓ వసం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వంగూరి దామోదర్, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణవేణి, శోభ, మధు, పేరాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన




**ప్రజాపక్షం/నూతనకల్ (మద్దిరాల) :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మద్దిరాల ఏఎస్ఐ శ్రీనివాసచారి అన్నారు. సోమవారం మద్దిరాల మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదలపై, షీ టీమ్స్ పైన పోలీసు కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థినిలు వేధింపులకు గురికాకుండా తక్షణమే 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంపాక నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ తేజశ్రీ, మహిళా కానిస్టేబుల్ జరీనా, శ్రీకాంత్, నాగరాజు, పోలీసు కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మండల విద్యాధికారి బి. లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని వెలుగుపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ నియోజక వర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. పాఠశాల దశలోనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పిఏసిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, పాఠశాల చైర్మన్ భాగ్యమ్మ, ఆయా మండలాల పిడిలు, పిఈటిలు పాల్గొన్నారు.



## బిసి రిజర్వేషన్ల అమలుకు సమరశీల పోరాటాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల రిజర్వేషన్లు అమలు చేసే వరకు బలమైన ఉద్యమాలు నిర్మించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో బీసీ యువజన సంఘం ప్రాముఖ్య సమావేశం నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా బలహీన వర్గాలకు చట్టసభల్లో తగిన రాజకీయ ప్రాతినిధ్యం దక్కకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. అత్యధిక జనాభా ఉన్న బీసీలకు చట్టసభలలో భాగస్వామ్యం లేకపోవడం వల్లే బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన హక్కులను పాలకులు పూర్తిగా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తూ ఎంపీటీసీ, కౌన్సిలర్, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. అగ్రవర్ణ రాజకీయ నాయకులు చట్టసభలను ఏలుతూ బీసీలను అన్ని రంగాల్లో అణచివేతకు గురిచేస్తున్నారని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్రపిడత సురేష్‌యాదవ్, బీసీ యువజన సంఘం పట్టణ నాయకుడు పట్టేటి రమేష్, యువజన సంఘం పట్టణ కన్వీనర్ రాజు ముదిరాజ్, సతీష్, వెంకట్, రాంబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మించాకే రోడ్డు వేయాలి.. గ్రామస్తుల డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మండల పరిధిలోని ముషంపల్లి గ్రామంలో డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టకుండానే రోడ్డు పనులు చేస్తుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మించిన తర్వాతే రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.రోడ్డును ఎత్తుగా నిర్మిస్తుండటంతో తమ ఇళ్లు లోతట్టు ప్రాంతాల్లోకి మారుతున్నాయని, వర్షాలు కురిస్తే మురుగునీరు ఇళ్లలోకి చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసమై మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముందుగా డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తి చేసి ఆ తర్వాతే రోడ్డు పనులు చేపట్టాలని,లేకుంటే అడ్డుకుంటామని స్పష్టం చేశారు.ఈ నిరసనలో వరికుప్పల రవి,వరికుప్పల అశోక్,పద్మ,అప్పల ఉషయ్య,బక్కతట్ల శ్రీను,నకిరేకంటి మైనాకర్,సత్తమ్మ,భాగ్యలక్ష్మి,నకిరేకంటి నాగరాజు, కిరణ్, సాల గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

### కంటైనర్ వాహనం నిర్లక్ష్యంగా మలుపు తిప్పడంతో ఘటన



**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ ధారా వేణుగోపాల్ ప్రయాణిస్తున్న అధికారిక వాహనం సోమవారం ఉదయం స్వల్ప రోడ్డు ప్రమాదానికి గురైంది.హైదరాబాద్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం వెళ్తుండగా నార్కెట్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారి65పై కామినేని ఫ్లైఓవర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది.కామినేని ఫ్లైఓవర్ సమీపంలో ఓకంటైనర్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంగా మలుపు తిప్పడంతో అదనపు కలెక్టర్ ప్రయాణిస్తున్న అధికారిక వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో అధికారిక వాహనం ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది.అయితే అదృష్టవశాత్తూ వాహనంలో ప్రయాణిస్తున్న అదనపు కలెక్టర్ ధారా వేణుగోపాల్‌తో పాటు ఇతరులకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ మేరకు ఎస్ఐ పి. విష్ణుమూర్తి వివరాలను వెల్లడించారు.

## జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రేబిస్ అనేది సోకిన కుక్కలు,ఇతర జంతువుల కాటు,గీతలు,లాలాజలం ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వైరల్ వ్యాధి అని,సకాలంలో చికిత్స,జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయడం ద్వారా నివారించవచ్చు అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు.ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో,ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలని,ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి యాంటీ రేబిస్ టీకాలు తీసుకోవాలని సూచించారు.రేబిస్‌ను నివారించవచ్చు,ప్రతి జంతువుకు టీకా,ప్రతి కాటుకు తక్షణ చికిత్స అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.వి. రమేష్,ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,డీఆర్‌డీఎ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు.సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అన్ని శా ఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వ రితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సోమవారం రెవిన్యూ శాఖకు 66 ,ఇతర శాఖలకు 82 మొత్తం 148 ఫిర్యాదులు వచ్చాయి.



## ప్రజా ఫిర్యాదులపై వేగంగా సేవలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజా ఫిర్యాదులపై అధికారులు వేగంగా స్పందించి సేవలందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించి మాట్లాడారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందన్నారు. ప్రజారక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరువర్గాలు పెద్దల సమక్షంలో సారమస్య పూర్వకంగా, చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## జాషువా ఆశయాలు ఆదర్శనీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజాకవి గుర్రం జాషువా ఆశయాలు, ఆయన చూపిన పోరాట మార్గం నేటి యువతకు ఎంతో ఆదర్శనీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు గుడిపాటి కోటయ్య తెలిపారు. సోమవారం మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తి వీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రజాకవి, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా 131వ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వై. దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డి.జలరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కబ్జాను అరికట్టాలి

**ప్రజాపక్షం/త్రిపురారం :** మండల కేంద్రంలోని త్రిపురారం చెరువు కబ్జాను అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు రెమిడాల రమేష్ అన్నారు. త్రిపురారం చెరువును కబ్జా చేస్తున్న కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలోబిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు భూములను మండలానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేశారన్నారు. చెరువు భూముల్లో మట్టిని పోసి వ్యవసాయ పొలాలకు, ఇండ్ల స్థలాలకు ఆ చెరువు భూమిని వాడుకుంటున్నారు అన్నారు. చెరువు భూమి కబ్జాకు గురి అవుతూ రోజు రోజుకు దాని విస్తీర్ణం తగ్గుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల మధు,కర్రజానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చందుపట్లలో బోనాల పండుగ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలం చందుపట్ల గ్రామంలో అక్టోబర్ 1న బోనాల పండుగ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని గ్రామ సర్పంచ్ దిగోజు లతా వెంకటాచారి తెలిపారు.తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా జరిగే బోనాల ఉత్సవాల్లో చందుపట్ల బోనాలకు ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. వందల ఏళ్లుగా భాద్రపద మాసంలో గ్రామంలో బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, రాష్ట్రంలో చివరిగా జరిగే బోనాలుగా చందుపట్ల ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరుకానున్నారని తెలిపారు.భక్తులు,ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పించి వేడుకను విజయవంతం చేయాలని సర్పంచ్ కోరారు.

## జర్నలిస్టుల హక్కుల కోసం అక్టోబర్ 2న ఆందోళనలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఆందోళనలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి తెలిపారు.దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, వృత్తిపరమైన భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అందులో భాగంగా నల్లగొండ జిల్లాలో మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా కేంద్రాల్లో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన టీయూడబ్ల్యూజే నాయకులు, సభ్యులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, వెబ్ మీడియా ప్రతినిధులు, వీడియో, ఫోటో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నూతన సెలూన్‌ను ప్రారంభం



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల కేంద్రానికి చెందిన మునుగోటి సాయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కేఎల్ సెలూన్‌ను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సెలూన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, నిర్వాహకుడు మునుగోటి సాయికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా తమకు ఉన్న నైపుణ్యాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిరోధానికి యువత ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/నందికొండ :** మత్తు పదార్థాల నిరోధానికి యువత ఉక్కు సంకల్పం చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు దాసరి రాజశేఖర్ పిలుపునిచ్చారు.సాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల చేత మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు,మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న మత్తు పదార్థాల వినియోగంపై అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వినియోగం వల్ల అనారోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు చింతపల్లి వెంకటయ్య,ప్రసన్న లక్ష్మీ,అధ్యాపకులు సతీష్ చంద్ర,ఉపేంద్ర చారి,సైదమ్మ, రవీందర్,మాధురి,జనార్దన్,దివ్య,శంకర్,ఫాతిమా, మరీనా,వినోద్, తదితరులు పాల్గొన్నారు.




## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/కోదాడ:** పేదల, సామాన్య ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆగవని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి, చిలుకూరు, కోదాడ రూరల్, కోదాడ టౌన్, మోతె, మునగాల, నడిగూడెం మండలాలకు చెందిన 295 మంది లబ్ధిదారులకు రూ.1,22,42,850 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద్య, మధ్యతరగతి కుటుంబాల్లో వైద్య ఖర్చులు తీవ్ర ఆర్థిక భారంగా మారుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థికసాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖరీదైన వైద్యం చేయించుకునే పరిస్థితిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అలసకాని శరభేశ్వరరావు, ముస్కు శ్రీనివాసరెడ్డి, కీత వెంకన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ సర్వసభ్య సమావేశం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వ సభ్య సమావేశం సోమవారం పిఏసిఎస్ చైర్మన్ అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఈవో నాగయ్య ఎజెండాలోని అంశాలను వివరించగా చైర్మన్ అండెం సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకున్న రుణాలను సంస్థలకు సకాలంలో చెల్లించినట్లయితే సంస్థ అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, విత్తనాలు, ఎరువులు, యూరియా విషయంలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడవద్దని సకాలంలో రైతులకు యూరియా, ఎరువులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. యూరియా కేంద్రాలను పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుద్దాల గ్రామంలోని పిఏసిఎస్ పెట్రోల్ బంక్ విషయంలో కూడా బంక్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఈవో నాగయ్య, బ్యాంక్ సిబ్బంది హనుమంతు, మంగ, సోమన్న, డైరెక్టర్లు నారాయణ, సోమన్న, చేనేత సంఘం చైర్మన్ ప్రకాష్, సర్పంచ్ మహేష్, లింగాల బిక్షం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల దుస్థితిపై బిజెపి పాదయాత్ర



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని 7,8,9,10వ డివిజన్ల పరిధిలో అధ్వానంగా ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర నాయకుడు,నల్లగొండ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే పిల్లి రామరాజు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. నడ్డివారిగూడెం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ఈ పాదయాత్ర కొనసాగింది.గంధంవారిగూడెం మెయిన్ రోడ్డు నుంచి అక్కలాయిగూడెం, గంధం వారిగూడెం నుంచి నడ్డివారిగూడెం, లాలాయి గూడెం,చింతభావిగూడెం ప్రాంతాల్లో రోడ్ల పనులు వెంటనే ప్రారంభించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.పాదయాత్రకు 10వ డివిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణంరాజు యాదవ్‌తో పాటు ఆయా డివిజన్ల ప్రజలు మద్దతుగా పాల్గొన్నారు.పాదయాత్రను పోలీసులు మధ్యలో అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.అనంతరం పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ ప్రజల రోడ్ల సమస్యల పరిష్కారం కోసం తాము పాదయాత్ర చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీను,పర్వతం శరత్,పిల్లి సత్యవతి, గుర్రంపూడ్,మండల అధ్యక్షుడు మామిడి వినోద్, ముంత సైదులు,బూడిగే భారత్,బోడ వంశీ,జెర్రిపోతుల స్వామి,దండుగల కొండల్, తదితరులతో పాటు ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** విద్యారంగానికి విశేష సేవలు అందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు సోమవారం మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. మండల విద్యా శాఖ అధికారి నకిరేకంటి రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తహశీల్దార్ గుమ్మి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని చెప్పారు. అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన సిహెచ్ అంజయ్య, ఎస్‌కె రఫియా, జె. రాధ, ఏ. సురేందర్ రెడ్డి, ఎన్. సంధ్యారాణి, ఎం. సునీత, కె. సంపత్, ఎస్. అనిత, పి. మణెమ్మ, ఎస్. కృష్ణమూర్తి, డి. గిరిజ, ఎన్. లింగయ్య, ఎస్. నరేష్, జి. వెంకటేశ్వర్లు, పి. నవీన్, ఏ. సరిత, జి. శ్రీకాంత్, వి. పద్మ, వి. జాకబ్, ఎస్. మహేష్, బి. విజయ్‌కుమార్, ఎండి ఖాజావహీద్దీన్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. చీకూరి అంజయ్య, ఎర్రంశెట్టి రవీందర్, నోడల్ ఆఫీసర్ వస్త్రం నాయక్, జిహెచ్ఎం జమాల్ షరీఫ్, టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ కోడి లింగయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

**ప్రజాపక్షం/నూతనకల్ :** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ నిధులు రూ.30లక్షలతో ఆహార ధాన్యాల నిల్వ కేంద్రం, రూ.10లక్షలతో గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, నూతనకల్ సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, మండల పార్టీ అధ్యక్షుడు కట్ల మల్లారెడ్డి, నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డి, పిఏసిఎస్ చైర్‌పర్సన్ నాగం జయసుధ పాల్గొన్నారు.

## రీగల్ రెక్స్‌నార్డ్ సంస్థ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రీగల్ రెక్స్‌నార్డ్ సంస్థ సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌కు కంప్యూటర్ సైన్స్,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాలకు చెందిన 130 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు హాజరై తొలిదశ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ పరిశ్రమలు నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ల ద్వారా విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్,ఈసీఈ విభాగాధిపతి జి. మారేశ్వర రావు, సీఎస్ఈ విభాగాధిపతి జయంతి,ఈఈఈ విభాగాధిపతి వై. నాగరాజు, వేణుగోపాల్ రెడ్డి,రేఖ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్,బీజేపీ వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరిక

**ప్రజాపక్షం/నార్కెట్‌పల్లి:** ఏపీ లింగోటం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యుడు దాసరి సైదులు,బీజేపీ పార్టీ వార్డు సభ్యుడు ఏరుకొండ వేణు తమ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గడ్డం పశుపతి,సీనియర్ నాయకులు బైరెడ్డి రాంగోపాల్ రెడ్డి,గోరేమియా,5వ వార్డు సభ్యుడు బొబ్బలి మల్లేష్,9వ వార్డు సభ్యుడు మెడబోయిన కళ్యాణ్,8వ వార్డు సభ్యుడు ఓరుగంటి శివకుమార్,ఓరుగంటి శివ,పాలకూరి నరేష్, గందమల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/డిండి; డిండి మండలంలోని తిప్పలేనేని గౌరారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త మాతంగి వెంకటయ్య ఈనెల 18వ తేదిన ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో చనిపోయారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులకు బిఆర్ఎస్ పార్టీ టీ. గౌరారం గ్రామ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆపదలో ఉన్న కార్యకర్త కుటుంబానికి రూ. 56,500లు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈసందర్భంగా వెంకటయ్య కుటుంబ సభ్యులు పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## నవ్వుల రారాజు వేణుమాదవ్



ప్రజాపక్షం/కోదాడ: తన హావా భావాలతో నటనతో అందరిమోములపై నవ్వులు పూయించిన వేణుమాదవ్ నవ్వులకే రారాజు అని తెర సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పార సీతయ్య లు అన్నారు. సోమవారం కోదాడలోని తెర సాంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో కోదాడ సిని హాస్యనటుడు వేణుమాదవ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరా, పాలిశెట్టి బ్రహ్మం, బూర సైదారావు, షేక్ పీర్‌సాహెబ్, చింతలపాటి శేఖర్, రామిశెట్టి హరిప్రసాద్ పాల్గొన్నారు.

## చదువుతోనే మహిళ సాధికారత



ప్రజాపక్షం/కోదాడ: చదువుతూనే మహిళ సాధికారత సాధ్యమవుతుందని మహిళ శిశు సంక్షేమ విద్యాశాఖ అధికారి చైతన్య పేర్కొన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలికలను చదివిద్దాం... రక్షిద్దాం అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో అగ్రభాగన ఉన్నారని పేర్కొన్నారు. క్లిష్టమైన రంగాలలోనూ పోటి పడుతున్న విషయన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మార్కేండేయ, ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, పద్మ పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వస్తకొండూరు గ్రామ గ్రామ పంచాయతీలో సోమవారం లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సర్పంచ్ లింగాల అనిల్‌కుమార్‌గౌడ్, ఉప సర్పంచ్ పరుశరాములు, గ్రామశాఖ అధ్యక్షులు లక్ష్మయ్యలు పాల్గొని డీలర్ శ్రీరంగం కౌసల్య ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.



## దివ్యాంగుల కోసం ప్రత్యేక గుర్తింపు పరీక్ష శిబిరాలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : దివ్యాంగులకు అవసరమైన సహాయక ఉపకరణాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గుర్తింపు పరీక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ఎస్.లావణ్యకుమారి సూచించారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జిఓ భవనంలో మహిళా, శిశు,దివ్యాంగుల,వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో భారతీయ కృత్రిమ అవయవముల తయారీ సంస్థ (అలిమ్కో) సౌజన్యంతో ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు గుర్తింపు శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొని బ్యాటరీ మోటారు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు,ట్రై సైకిళ్లు,చంక కర్రలు,ఎంఆర్ కిట్లు,బ్లైండ్ కిట్లు,స్మార్ట్ కేన్లు,క్రచెస్ తదితర సహాయక ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల ప్రత్యేక అవసరాల కోసం జిల్లాలోని నాలుగు డివిజన్లలో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 29న మిర్యాలగూడలో, 30న దేవరకొండలో,అక్టోబర్ 1న చండూరు డివిజన్ లో శిబిరాలు నిర్వహిస్తామని, అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అలిమ్కో ప్రతినిధి సోను కుమార్,శ్రీహరి,సాదిక్ పాషా, బాలయ్య, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యూయేట్లు ప్రతి ఒక్కరు ఎంఎల్‌సి ఓటు హక్కు నమోదు



ప్రజాపక్షం/దేవరకొండ; పట్టభద్రులైన ప్రతి ఒక్కరు తమ ఎంఎల్‌సి ఓటు హక్కును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఓటు హక్కును దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ నమోదు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రాడ్యూయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ప్రతి పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఉన్న గ్రాడ్యూయేట్ ఓటరు జాబితా రద్దైన నేపథ్యంలో పాత ఓటర్లు, కొత్తగా అర్హత పొందిన పట్టభద్రులు అందరూ తప్పనిసరిగా మరళ తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుత అధికార కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షంగా బిఆర్ఎస్ పార్టీ కొనసాగిస్తున్న ప్రజా పోరాటాలను పట్టభద్రులు గమనించాలని రవీంద్రకుమార్ అన్నారు. ఉమ్మడి నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గానికి సంబంధించిన ఓటు నమోదు కోసం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## విద్యాసేవలో ఉపాధ్యాయుడి గుర్తింపు.. పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/వలిగొండ : ప్రైవేట్ విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని పవిత్రాత్మ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సవిత అన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ట్రస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసేవ రత్న అవార్డు2026 కార్యక్రమంలో పవిత్రాత్మ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జెనీఫర్, తెలుగు ఉపాధ్యాయుడు ఎస్. పాండును ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సవిత వారిని అభినందించారు. వీరిలో నలుగురు విద్యార్థులు గోల్ మెడల్స్, ముగ్గురు సిల్వర్ మెడల్స్, 16 మంది బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విజేతలకు పతకాలతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్కు ఎంపికైన విద్యార్థి హేమంత్ సాయిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ సంగీత, సిస్టర్ శైల, మాస్టర్ రాజు, మాస్టర్ సిద్ధార్థ, వ్యాయామ ఉపాధ్యాయుడు పరుశురాం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు సేవా సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా వినోద్ కుమార్ నియామకం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా అనుముల మండలం పులిమామిడి గ్రామానికి చెందిన కలకుంట్ల వినోద్ కుమార్ నియమితులయ్యారు.ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కె.బాబురామ్ నాయక్ సోమవారం నియామక పత్రాన్ని జారీ చేశారు.వినోద్ కుమార్ సమాజ సేవ పట్ల కనబరుస్తున్న అంకితభావం, నాయకత్వ లక్షణాలను గుర్తించి ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు బాబురామ్ నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సమాచార హక్కు చట్టం 2005 పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి, అవినీతి నిర్మూలనకు సంస్థ పరంగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా ప్రజల హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.



## అర్హులైన పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడం తోపాటు, ఇప్పటికే నమోదైన ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై అవసరమైన సహాయాన్ని అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారం తీసుకోవాలి

ప్రజాపక్షం/చింతలపాలెం : గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తోపాటు సమతుల్య ఆహారం తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు అందించే పౌష్టికాహారంకు సంబంధించి అంగన్‌వాడీ పౌష్టిక వారోత్సవాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలో అందించే గుడ్లు, పాలు, పప్పులు, బాలామృతం ద్వారా అనేక విలువైన పోషక విలువలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల సూపర్‌వైజర్ సరిత, హెల్త్ డిపార్టుమెంట్ డాక్టర్ వినయ్ కుమార్, ఏఎన్ఎం కళ్యాణి, బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు మోర్తాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## విబిజి రాంజీ ఉపాధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని అన్ని గ్రామాలలో 2026 27 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే విబిజి రాంజీ ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడివో మల్సూర్‌నాయక్ కోరారు. సోమవారం మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో విబిజి రాంజీ ఉపాధి హామీ పనులపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 374 రకాల పనులను విబిజి రాంజీ ద్వారా చేపట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దున్న శ్రీనివాస్, కంభంపాటి సరిత చైతన్య, నర్సింహారావు, విమలపంగు సరోజిని, రంగయ్య, రుక్మిణి, వెంకటేశ్వర్లు, ఎపివో శ్రీనివాసరావు, ఈసి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రూ.3,55,000లకు లడ్డూను కైవసం

ప్రజాపక్షం/డిండి; డిండి పట్టణంలోని శ్రీ రాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూ వేలం పాటలో రికార్డు ధర పలికింది. వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ఈ లడ్డూ వేలంపాటలో రికార్డు స్థాయిలో రూ. 3,55,000 ధర పలకగా డా. సింధూజ శోభన్ బాబు దంపతులు లడ్డూను దక్కించుకున్నారు. ఈసందర్భంగా శ్రీరాంనగర్ కాలనీ గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, కాలనీ ప్రజలు డా. సింధూజ శోభన్‌బాబు దంపతులకు అభినందనలు తెలిపారు. భక్తి, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ లడ్డూ వేలం పాటలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు ఏటి కృష్ణ, సాయి, శ్రీకాంత్, రవిశంకర్, ప్రశాంత్, వికాస్, రజినీ, చారి పాల్గొన్నారు.





## శంకుస్థాపన

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని దూపహాడ్ గ్రామంలో ఎస్‌సి సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం గ్రామ సర్పంచ్ నన్నెపంగ కమలమ్మ సైదులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లక్ష్యమన్నారు. ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి పిన్నెని కోటేశ్వరరావు, మార్కెట్ డైరెక్టర్ అర్తి కేశవులు, ఉపసర్పంచ్ అర్తి నరేష్, గ్రామ కార్యదర్శి స్వప్నతోపాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి విశేష స్పందన

**ప్రజాపక్షం/చివ్వెంల** : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని ప్రజలు వివిధ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులను అందించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ డి. వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ చక్రాల సంతోష్ కుమార్ మాట్లాడుతూ బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదులను పట్టించుకోకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/చండూరు**: చండూరులోని పలు ఎరువుల దుకాణాలలో వ్యవసాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలోని దస్త్రాలు , రికార్డులను ,ఎరువులకు సంబందించిన ఇన్వాయిస్‌లను ,బిల్లులు ,స్టాక్ రిజిస్టర్లు క్షుణంగా పరిశీలించారు. పలు ఎరువుల దుకాణాదారులను హెచ్చరిస్తూ అన్ని నాణ్యమైన ఎరువులను మాత్రమే రైతులకు ఎమ్మార్పీ ధరకు అందించాలని అన్నారు. ఎవరైన దుకాణాదారులు నకిలీ ఎరువులు అమ్మిన వారి యొక్క లైసెన్సులు రద్దు చేయడం తో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు వేణుగోపాల్ , మండల వ్యవసాయాధికారి మల్లేశం , ఏఈఓలు పాల్గొన్నారు.

## ఛాతీ నొప్పి కేసులు వెంటనే 108కు కాల్ చేయండి

**ప్రజాపక్షం/భువనగిరి** : ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి గుండె సంబంధిత అత్యవసర లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే 108కు కాల్ చెయ్యాలని వైద్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సెప్టెంబర్ 29 సందర్భంగా గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2026 ప్రచార నినాదం Don't Miss a Beat. తెలంగాణలో EMRI గ్రీన్ హెల్త్ సర్వీసెస్కు నమోదైన 8,08,755 అత్యవసర కేసుల్లో 22,699 (3 శాతం) గుండె సంబంధిత కేసులు నమోదయ్యాయి. ఇందులో నెలకు సగటున 1,892, రోజుకు సుమారు 62 ఛాతీ నొప్పి కేసులు నమోదవుతున్నాయి. పురుషులు 53 శాతం, మహిళలు 47 శాతంగా నమోదయ్యారు.

## ఢిల్లీ బరిలో సాగర్ షటిల్ క్రీడాకారులు



**ప్రజాపక్షం/నందికొండ** : షటిల్ బ్యాడ్మింటన్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన స్థానిక డీఏవీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సాగర్ కీర్తిని చాటారు.అక్టోబర్ 24 నుంచి 26 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అండర్17 బాలుర షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు పాఠశాల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారు.గత ఆగస్టు 22,23 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో డీఏవీ హైస్కూల్ బాలుర జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది.ఈ విజయంతో జట్టు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.జట్టులో ఎస్.ఉజ్వల్,ఆర్.హరిప్రసాద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కాగా,బాల ఆదిత్య స్టాండ్‌బైగా ఎంపికయ్యాడు.జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను టీజీ జెన్‌కో సీఈ వి.మంగేష్ కుమార్,ఎస్ఈ టి.వెంకటరమణ,సివిల్ ఎస్ఈ డి.రామకృష్ణారెడ్డి,ఈఈ ఏవీ. సత్యశివకుమార్,ఎస్ఏఓ డి.శిరీష,డీఏవీ ఏఆర్‌వి జీఆర్‌కె ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు జె. పవన్ కుమార్, పీఈటీ ఏ. సాయికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

## బిఆర్ఏఓలో ప్రవేశాలకు రేపే చివరి గడువు



**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్యను ప్రతి ఒక్కరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులు,విద్యా విధానాలను అమలు చేస్తోందని రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ బొజ్జ తెలిపారు.సోమవారం నల్లగొండ రీజినల్ కేంద్రంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.2026 విద్యా సంవత్సరానికి యూజీ,పీజీ,డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని,అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ కారణాలతో రెగ్యులర్ విద్యను కొనసాగించలేకపోయిన వారికి ఓపెన్ యూనివర్సిటీ విద్య ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో,తమ సొంత వేగంతో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు.ప్రతి విద్యా సంవత్సరంలో నల్లగొండ జిల్లా నుంచి యూజీ, పీజీ అడ్మిషన్లు అత్యధికంగా ఉంటాయని,ఈ ఏడాది కూడా అడ్మిషన్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

## జిల్లా కబడ్డీ బరిలో ఏవీఎం విద్యార్థులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని ఏవీఎం పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 30న దేవరకొండలో నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు.అండర్14 బాలుర విభాగంలో డి.అరవింద్ నాయక్, ఆర్.అంజిబాబు, ఎం.శేఖర్, జి.అఖిల్,బాలికల విభాగంలో శ్రీరాముల తేజశ్రీ,కె.అక్షిత, ఎన్.వైశాలి, ఎం.జాహ్నవి, ఏ.వెన్నెల ఎంపికయ్యారు. అండర్17 బాలుర విభాగంలో యానాల రితిక్‌రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కందాల పాపిరెడ్డి,ప్రిన్సిపల్ కందాల స్వప్న శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు నిమ్మల శంకర్‌గౌడ్, పూజిత, ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు.

## పర్యాటక దినోత్సవ పోటీలలో క్రిష్ణవేణి విద్యార్థులు

**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోయువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వివిధ పోటీలలో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ డిస్ట్రిక్ సెకండ్ ప్రైజ్ సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు.పాఠశాల విద్యార్థులు ఎస్.శరణ్ తేజ్, ఎల్.విశ్వసాయి, ఎస్.శ్రీకారుణ్య, తస్లీం ఖానం, ఈ.శ్రీవిద్య తదితరులు జిల్లా పర్యావరణ మరియు టూరిజం శాఖ ఆధ్వర్యంలో జరిగిన పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ మురళిని కరెస్పాండెంట్ తోపాటు ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జెవిఎన్ఎస్ మణి అభినందించారు.



## పరిశుభ్రంగా ఉంచుదాం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : తాజ్‌పూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'స్వచ్ఛతా హి సేవా 2026 [సెప్టెంబర్ 17 అక్టోబర్ 02]లో భాగంగా సెప్టెంబర్ 28 స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రపంచ పర్యాటక దినోత్సవంను పురస్కరించుకొని గ్రామ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ పాలకవర్గం భాగస్వామ్యంతో తాజ్ పూర్ గ్రామం లో ప్రముఖ దేవాలయం ఎంతో మంది భక్తులు సందర్శించే అతి పురాతన పుణ్య క్షేత్రం శ్రీ శ్రీ శ్రీ త్రిలింగేశ్వర స్వామి వారి దేవాలయం వద్ద దేవాలయ పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త డా.ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్ రావు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వినతుల స్వీకరణ

**ప్రజాపక్షం/నాంపల్లి** : మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ శర్మ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోజు ప్రజావాణికి ఐదు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.స్వీకరించిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత శాఖల అధికారులకు పంపి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు,వివిధ శాఖల ప్రతినిధులు,కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రణాళిక గ్రామసభ

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండలం మహమ్మదాబాద్ గ్రామంలో గ్రామ పంచాయతీ వికసిత్ ప్రణాళిక సమావేశం సర్పంచ్ ముత్యాల అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జి రాంజీ ఉపాధి పథకం లో చేపట్టవలసిన పనులను గ్రామ సభ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ పథకంలో భాగంగా రైతులకు తోటల పెంపకం, పశువుల పాకలు, పత్తి కుంటలు, ఊట కుంటలు, రోడ్లు, చెక్ డ్యాములు, గ్రంథాలయముల, కమ్యూనిటీ హాల్ ,ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి ఊరుకు ఊట కుంట, ప్రతి రైతుకు పత్తికుంట ,ఏర్పాటు చేసుకోవాలని మండల అధికారులు సూచించారు. ఈ పథకం జలసిరి లో కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి ,వార్డు సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ 18 మంది లబ్ధిదారులకు తహసిల్దార్ పల్నాటి శ్రీనివాస్ రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జుబేరుద్దీన్, సర్పంచులు, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు కట్ల వనజ భాస్కర చారి, రఘు, బాలకృష్ణ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాంబ్ బ్లాస్టింగ్.. ఇళ్లపైకి రాళ్లు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** లారీల ఆఫీస్ వెనుక గుట్ట మీద భారీ బాంబ్ బ్లాస్టింగ్ జరగడంతో భారీ శబ్దాలతో రాళ్లు ఇళ్ల మీద పడి రేకులు పగిలిపోయాయని,తృటిలో ప్రాణాపాయం తప్పిందని మాధవ నగర్ 12వ డివిజన్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.ఇంతకుముందు ఎన్నోసార్లు చెప్పినా వినకుండా రాత్రి పగలు తేడా లేకుండా బ్లాస్టింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు.ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని అక్కడ నివసిస్తున్నామని వాపోయారు.అదే విషయాన్ని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని,వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. తక్షణమే ఇచ్చిన పర్మిషన్ ను రద్దు చేయాలని మాధవ నగర్ 12వ డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వి రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఖాసిం,బెరి నాగరాజు,రియాజ్, నజీర్,షాన్ రియాజ్,అస్మా, అబ్దుల్ సాబ్, ఉస్మాన్ తదితరులు ఉన్నారు.



## ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మండలంలోని దండుమల్కాపురం,బోర్రోళ్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు.అదేవిధంగా రూ.2,23,650 విలువైన నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శోభారాణీ,అక్బర్ పాషా,శ్రీలక్ష్మి ,డాక్టర్ జయంత్‌కుమార్,నరేష్,దివిస్ ప్రతినిధులు గోపి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గోన్నారు.

## మండల స్థాయి ప్రజావాణి



**ప్రజాపక్షం/రామన్నపేట** : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఏ.రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరయ్యారు. గైర్హాజరైన అధికారుల వివరాలను ఎంపీడీఓ జిల్లా అధికారులకు నివేదించారు .ఈ సోమవారం జరిగిన ప్రజావాణిలో మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో తహసీల్దార్కు 4, ఇరిగేషన్ శాఖకు 1, నల్గొండ డీఎంకు సంబంధించిన మరో దరఖాస్తు అందినట్లు అధికారులు వెల్లడించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.రాములు,తహసీల్దార్ సి.లాల్ బహదూర్,ఎంపీఓ ఎండీ రఫీ,ఏఓ శ్రీనివాస్ గౌడ్,ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఆశిష్ రాఘవ,మెడికల్ ఆఫీసర్ ఎం.బేబీ శాలిని,వెటర్నరీ అసిస్టెంట్ డా.కె.జ్యోత్స్న తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మాజీ ఎంపిటిసి మృతి

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మండలం పెద్దకొండూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి బద్దం పాండు రెడ్డి(68)సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందారు.గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు పెద్దకొండూరు గ్రామ పరిధిలోని గుడ్డోనిబావి గ్రామంలో బంధువుల పంక్షన్‌కు సోమవారం వెళ్ళారు.పంక్షన్ నుండి పెద్ద కొండూర్ గ్రామానికి కారులో తిరిగి వస్తుండగా గుండెపోటుతో కారులోనే మృతి చెందగా ,కారు రోడ్డు దిగి చెట్టును ఢీకొట్టింది. గ్రామస్తులు కారును గమనించి చూడగా అప్పటికే మృతి చెందాడు.పాండు రెడ్డి సిపిఎం లో చాలా కాలం పనిచేసి తర్వాత టిడిపి పార్టీలోకి వెళ్ళి మండల అధ్యక్షుడిగా,గ్రామ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు,ఎంపిటిసిగా పని చేశాడు.రైతు నాయకుడిగా ఎదిగిన పాండు రెడ్డి అకాల మరణం పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.గ్రామానికి,మండలానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.నేడు పెద్దకొండూర్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఉద్యమకారులకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/వలిగొండ** : ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఉద్యమకారునికి ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్టలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యమకారులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శీలం స్వామి మాట్లాడుతూ కార్యక్రమానికి హాజరై విజయవంతంవిజయవంతం చేసిన ఉద్యమకారులు, నాయకులు, అభిమానులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్లోనూ ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

# రైతుల సంక్షేమమే కేంద్రంగా సహకార సంఘాలు మరింత బాధ్యతతో పనిచేయాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రైతుల సంక్షేమమే కేంద్రంగా సహకార సంఘాలు మరింత బాధ్యతతో పనిచేయాలనీ రైతన్నల ప్రతీ సమస్యకు పరిష్కారం చూపే దిశగా అందరు కృషి చేయాలని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.పోచంపల్లి మండలం జూలూరు పిఎసిఎస్ పర్సన్ ఇన్చార్జ్ చైర్మన్ కళ్ళెం రాఘవరెడ్డి అధ్యక్షతన శుభం ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన మొదటి సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అథిధిగా హాజరయ్యారు.సంఘం సిఈవో అర్థవార్షిక నివేదిక సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సహకార సంఘాల ద్వార రైతుల సమస్యలు పరిష్కరిస్తూనే సబ్సిడిలపై రుణాలు ఎరువులు సరఫరా చేస్తున్నదని తెలిపారు.త్వరలోనే మూసి కాలువలను ప్రక్షాలన చేసి మూసి పరివాహక ప్రాంతాలను సస్య శ్యామలం చేసి పంట దిగుబడిలో అగ్రగామిగా నిలుపుతామని హామి ఇచ్చారు.రైతులకిచ్చిన ప్రతి మామీని నెరవేర్చి అన్ని అవసరాలను తీర్చే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు.ఎవ్వరైనా సరే ఏ అధికారైనా ప్రజలకు ఇడ్డందులకు గురిచేస్తె సహించేది లేదని హెచ్చరించారు.



### స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకం

స్మార్ట్ రేషన్ కార్డులతో ప్రభుత్వ సేవలు పథకాలు ప్రజలకు మరింత పారదర్శకంగా అందుతాయని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. పోచంపలిలో బాలాజి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అథిధిగా హాజరయ్యారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు పన్నబియ్యం పంపిణి చేసి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించామని చెప్పారు.అర్హులందరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘనత కూడ కాంగ్రెస్ పార్టీకే దక్కిందని పేర్కొన్నారు.

# గొర్రెల,మేకల మార్కెట్ యార్డును నిర్వహణ చేయాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో రూర్బన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించిన గొర్రెల,మేకల యార్డ్‌ను నిర్వహణ చేయాలని జిఎంపిఎస్ రాష్ట్ర నాయకులు బండారు నర్సింహ్మ డిమాండ్ చేశారు.కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌డిఓ కు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్‌లో అంగడి స్థలంలో దశాబ్దాలుగా ఆదివారం అంగడి రోజు గొర్రెల,మేకల సంత కూడా జరిగేది.చౌటుప్పల్ మండలంతో పాటు సంస్థాన్ నారయణపురం,వలిగొండ,భూదాన్‌పోచం పల్లి, చిట్యాల మండలాల పెంపకందారులు జీవాలను విక్రయించేవారు.అంగడి స్థలంలో మునిసిపల్ కార్యాలయం నిర్మాణం చేయడం,రైతుబజార్



ఏర్పాటు చేయడంతో అంగడిలో స్థలం లేకుండా పోయింది.రూర్బన్ మిషన్ పథకంలో భాగంగా రూ.50లక్షలతో పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో గొర్రెల మార్కెట్ షేడ్‌ను 2024లో నిర్మాణం చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ్మ,నాయకులు అవిశెట్టి పాండు,పాక జహంగీర్,కొండే శ్రీశైలం,గునమోని అయిలయ్య,గజ్జి పాండు తదితరులు పాల్గోన్నారు.

# సిఎంఆర్‌ను బాయిల్డ్ రైస్‌గా సేకరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిల్లుల్లో నిల్వ ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను బాయిల్డ్ రైస్‌గా వెంటనే సేకరించాలని మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిల్లర్ల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రారంభమైందని, మిల్లుల వద్ద ఉన్న గోదాముల్లో గత సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం నిల్వలు పేరుకు పోయాయని తెలిపారు.గోదాముల్లో స్థలం లేకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న నూతన సన్న రకం ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ప్రతినిధులు వెంకటరమణ చౌదరి, బండారు కుశలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యం

**ప్రజాపక్షం/మోటకొండూరు** : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని సర్పంచ్ జెట్ట లత మహేశ్వర్ అన్నారు. మూటకొండూరు మండలం కదిరేణిగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ఆమె ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. నార్కెట్ పల్లి కామినేని ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు జ్వరం, షుగర్, బీపీ, ఎముకలు మరియు కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, థైరాయిడ్, హెర్నియా, కిడ్నీ రాళ్లు వంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సుమారు 300 మందికి పైగా ఈ శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు అందజేశారు. ఉప సర్పంచ్



వేముల పాండు, వార్డు సభ్యులు వేముల నరేష్, వేముల లావణ్య, వేముల నరసింహా, బొడ్డుపల్లి మత్స్యగిరి, సామ అరుణ, పంచాయతీ కార్యదర్శి కొక్కొలకొండ శ్రీనివాస్, నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ నుండి ఆర్థోపెడిక్ డాక్టర్ పీ. గౌతమ్, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ప్రజాసేవను బాధ్యతగా భావించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : ప్రజాప్రతినిధులుగా పదవులు వచ్చిన వారు ప్రజాసేవను బాధ్యతగా భావించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.చౌటుప్పల్ సింగిల్ విండో పాలకవర్గం నియామాకం తర్వాత పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే పాలకవర్గ సభ్యులకు శాలువాలు కప్పి సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు దగ్గరగా ఉంటూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.పదవులు రాగానే కిరిటంగా భావించి రైతులకు,ప్రజలకు దూరంగా ఉండోద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ ఈడ్దుల మస్తాన్‌బాబు,వైస్ చైర్మన్ పర్నె శివారెడ్డి,మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్,మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గోన్నారు.

## రీల్ మేకింగ్ పోటీలో పాల్గొన్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన రీల్ మేకింగ్ పోటీలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతుల్ని సాధించారు. బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పి.భానుశ్రీ, బి.ఏ.ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి.చందు రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా బహుమతుల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు,కార్యాలయ సిబ్బంది,విద్యార్థులు విజేతలను అభినందించారు.

## మైక్రోస్కోపిక్ స్పైన్ సర్జరీ విజయవంతం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోనే మొదటిసారిగా అత్యంత ఆధునిక మైక్రోస్కోపిక్ స్పైన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు లీల ఆసుపత్రి ప్రముఖ సర్జన్ డాక్టర్ గడ్డం సాయి హరీష్ తెలిపారు. సోమవారం మిర్యాలగూడలోని లీల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్జరీ వివరాలు వెల్లడించారు. తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్న రోగికి అత్యాధునిక మైక్రోస్కోపిక్ విధానంలో స్పైన్ సర్జరీ నిర్వహించి, శస్త్రచికిత్స జరిగిన మరుసటి రోజే క్షేమంగా డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు కలిగిన లీల హాస్పిటల్‌లో కార్పొరేట్ స్థాయికి సమానమైన అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.నడుము నొప్పి, వెన్నుముక సమస్యలతో బాధపడే రోగులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విమలక్క 50 ఏళ్ల ప్రజా కళాప్రస్థానం అద్వితీయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : ప్రజాగళమై, పాటతో సమాజంలో చైతన్యం నింపిన ప్రముఖ విప్లవ ప్రజా గాయకురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు అరుణోదయ విమలక్క 50 ఏళ్ల సుదీర్ఘ ప్రజా కళా ప్రస్థానం అద్వితీయమని యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ నాయకులు పూస బాలకిషన్ కొనియాడారు. హైదరాబాద్లో అత్యంత వైభవంగా నిర్వహించిన అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా కళా జాతర వేడుకల్లో పూస బాలకిషన్ ప్రత్యేకంగా పాల్గొని, విమలక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం





**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేటి యువతకు భగత్‌సింగ్ జీవితం ఒక స్ఫూర్తి పాఠమని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యులు దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ 119వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొదమగుండ్ల నగేష్, రాపోలు నవీన్, యడవెల్లి అరుణ్, సిరికొండ శ్రీను, ముత్యాల భాస్కర్, బెల్లంకొండ గోవింద్, కొమ్రరాజు వెంకట్, నీలా రామ్మూర్తి, పిల్లలమర్రి పుల్లారావు, వాడాల భాస్కర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి** : భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతకు ఎంతో ఆదర్శమని ఏఐవైఎఫ్ నాంపల్లి మండల ప్రధాన కార్యదర్శి చిన్నోజు వెంకటాచారి అన్నారు.సిపిఐ కార్యాలయం వద్ద సోమవారం భగత్‌సింగ్ 119వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఏఐవైఎఫ్ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గిరి స్వామి,రామస్వామి,పల్లెటి దశరథ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** సమ సమాజ స్థాపన కోసం విద్యార్థులు భగత్ సింగ్ బాటలో ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ పిలుపునిచ్చారు.పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో సోమవారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యశ్వంత్,పట్టణ నాయకులు సతీష్,లోకేష్, చరణ్య, ఫాతిమా,కావేరి,మనీషా తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** షహీద్ భగత్‌సింగ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు ఎడెల్లి శ్రీకాంత్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్రన్న కుంట దగ్గర ఇండస్ హైస్కూల్‌లో భగత్‌సింగ్ 119వ జయంతిని పురస్కరించుకొని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చామల లచ్చయ్య (సి.ఎల్) జ్ఞాపకార్థం వారి కుమారుడు చామల అశోక్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల అధినేత చిట్లింకి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు దంతాల రాంబాబు, బొమ్మగాని శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, నీలా శ్రీనివాస్, గుగులోత్ రాజారాం, తొగిటి మురళి, ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని సిపిఐ ప్రజా భవన్‌లో సోమవారం షాహిద్ భగత్‌సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎల్మినేటి నరేష్‌లు షాహిద్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షులు కొండల్, అరుణ్, చింటూ, జంగయ్య, తిర్పతయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : స్వాతంత్ర్య సమరయోధుడు విప్లవ




వీరుడు భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలను ఏఐవైఎఫ్ అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసిఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ మండల అధ్యక్షుడు దుబ్బాక భాస్కర్, కే.విప్లవ్, ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, వార్డు సభ్యులు పందుల యాదగిరి, వీరమల యాదయ్య, సింగపంగ రమేష్, గడ్డం యాది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల



కేంద్రంలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 119వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఇర్ఫాన్, ఉపాధ్యక్షులు ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమేష్, మధు, రాజు, సుధాకర్, రాజు, ఐలమల్లు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/దేవరకొండ;** భారత స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ పాలకులను గడగడలాడించి భారత యువతకు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విప్లవ వీరుడు సర్దార్ షాహిద్ భగత్‌సింగ్ అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో షాహిద్ భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సూరిగి వినయ్, శివకుమార్, దేవరకొండ, చందంపేట, డిండి మండల అధ్యక్ష, కార్యదర్శులు సిద్దు, హన్మంత్, అజయ్, అనిల్‌రెడ్డి, యశ్వంత్, రమేష్ తదితరులు ఉన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ** : భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నేటి సమాజం చైతన్యవంతం కావాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎల్లంకి మహేష్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని వలిగొండ మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పోలపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహచారి, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు బోడిగే సుదర్శన్ గౌడ్, మామిడికాయల నరేష్ పాల్గొన్నారు.



భగత్ సింగ్ ఆశయ సాధన కోసం యువత పనిచేయాలి

ప్రజాపక్షం/మర్రిగూడ : భగత్ సింగ్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువజనులు దేశం కోసం పనిచేయాలని, దేశ భవిష్యత్తు విద్యార్థి, యువజనుల భుజాలపైనే ఉందని విద్యార్థి నాయకుడు,మాజీ ఎంపీటీసీ సిలివేరు విష్ణు పిలుపునిచ్చారు.సోమవారం దామెర భీమనపల్లి గ్రామంలో కాంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యులు,గ్రామ యువతతో కలిసి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి నడిమింటి శ్రీను, వార్డు సభ్యులు సిరగోని సుమతి రవి యాదవ్,అంబళ్ల భవాని రవి గౌడ్,పెంబళ్ల శేఖర్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** షహీద్ భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్ పిలుపునిచ్చారు.భగత్‌సింగ్ జయంతిని చౌటుప్పల్ సిపిఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని పేదలు ఒక్కపూట తిండి కూడా దొరకని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎండి.పాషా,బత్తుల దాసు,ఆకుల ధర్మయ్య,ఉష్కాగుల శ్రీను, ఎండి.ఖయ్యూం,తోర్పునూరి మల్లేష్,సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి,బోడ్డు రాజు,బోడ్డు అంజిరెడ్డి,ఆర్టీఓ పాష,యాదగిరి,అంతటి ఆశోక్,గౌస్ పాషా పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన విప్లవ వీరుడు, అమరుడు భగత్సింగ్ 119వ జయంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) యాదగిరిగుట్ట మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి, కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మాజీ కోఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, అనంతుల నరసింహ, పేరబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

## చిన్నారులే వక్తలు..తల్లిదండ్రులే ప్రేక్షకులు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో ఎల్‌కేజీ, యూకేజీ, 1,2వ తరగతుల విద్యార్థులకు ‘స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు.విద్యార్థులు తమ విద్యా ప్రగతి, నేర్చుకున్న అంశాలు, ప్రతిభా సామర్థ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో స్వయంగా వివరించారు. చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని యాజమాన్యం తెలిపింది.ఈకార్యక్రమంలో డీజీఎం వెంకట్ రమణారెడ్డి,ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్,వైస్ ప్రిన్సిపాళ్లు హసీనా, ఉమామహేశ్వరి,ఏవో క్రాంతి,కోఆర్డినేటర్లు సునీత, హరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.